మహా శివరాత్రికి సర్వం సిద్ధం

- శని త్రయోదశి నాడే మహాశివరాత్రి
- రెండూ ఒకేసారి రావడం అరుదు అంటున్న పండితులు
- ముస్తాబవుతున్న శైవక్షేత్రాలు
- పటిష్ట బందోబస్తుకు చర్యలు



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు(ఫైల్‌ఫోటో)

కొవ్వూరు: మహాశివరాత్రి మహోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. గ్రామాల్లోని శివక్షేత్రాలన్నీ ముస్తాబవుతున్నాయి. ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేసి, దర్శనం చేసుకునే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ఈ ఏడాది శని త్రయోదశి రోజున మహాశివరాత్రి రావడంతో భక్తుల తాకిడి అధికంగా ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే గోష్పాద క్షేత్రానికి తరలివచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లపై ఆర్డీవో ఎస్.మల్లిబాబు అధికారులతో సమీక్షించారు. క్షేత్రంలో పర్యటించి అధికారులకు ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఏటా గోష్పాదక్షేత్రానికి 50 వేలకు పైగా భక్తులు విచ్చేస్తుంటారు. దీంతో అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. శనిత్రయోదశి రోజు శనీశ్వరుడికి అత్యంత ప్రీతికరమైన రోజు. ఇదే రోజు మహా శివరాత్రి పర్వదినం, మాస శివరాత్రి ఒకే రోజు రావడం అరుదు అని పండితులు చెబుతున్నారు. రెండు ఒకేసారి రావడం 144 ఏళ్ల తర్వాత జరిగిందని వివరించారు. కొందరు పండితులు 22 ఏళ్ల తర్వాత వస్తుందని చెబుతుండడం ఈ శివరాత్రి ప్రత్యేక విశిష్టతను సంతరించుకుంది. ప్రధానంగా గోదావరి నదీతీరంలో ఉన్న తాళ్లపూడి, కొవ్వూరు, నిడదవోలు, పెరవలి మండలాల పరిధిలో ఉన్న శివాలయాలకు భక్తులకు తాకిడి అధికంగా ఉండే అవకాశం ఉంది.

గోష్పాదక్షేత్రంలో ప్రధాన స్నానఘట్టాల్లో స్నానాలు ఆచరించే భక్తులకు రక్షణ వలయంగా ప్రత్యేక బోట్లు, గజ ఈతగాళ్లను మత్స్యశాఖ ఏర్పాటు చేస్తున్నారు. స్నాన ఘట్టంలో అదనపు విద్యుత్‌లైట్లు, పారిశుధ్య నిర్వహణకు 60 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్టు మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ తెలిపారు. భక్తులకు తాగునీటి వసతి, ఇతర సహాయ కార్యక్రమాలు చేయడానికి మరో నలభైమంది సిబ్బందిని నియమించినట్టు ఆయన తెలిపారు. వైద్య శిబిరాలు, అందుబాటులో అంబులెన్స్‌లు ఉంచినట్టు చెప్పారు. క్షేత్రంలో భక్తులకు అవసరమైన బందోబస్తు ఏర్పాటుకి పోలీసు అధికారులు ఇప్పటికే సిబ్బందికి విధులు కేటాయించారు.

ముస్తాబైన శివాలయాలు

పట్టణ, గ్రామాల్లో శివాలయాల్లో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా గోదావరి నదీతీర ప్రాంతంలో ఉన్న ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలో సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వరస్వామి, గోష్పాదక్షేత్రంలోని బాలత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం కల్యాణ మహోత్సవం నిర్వహించారు. వాడపల్లిలో అనంత భోగేశ్వరస్వామి రథోత్సవం శనివారం మధ్యాహ్నం నుంచి జరగనుంది. మద్దూరు గ్రామంలో ప్రబల ఉత్సవం నిర్వహించనున్నారు. చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో బాలా లింగేశ్వరస్వామి ఏటా మాదిరిగా త్రిశూల పూజ నిర్వహించనున్నారు. ఏటిగట్టుపై పంచాయతన శివాలయం, పాతూరులోని ఉమాచోడేశ్వ రస్వామి ఆలయాల్లోను ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దొమ్మేరు ఉద్దండ మల్లికార్జున స్వామి, చిడిపిలో హాటకేశ్వరస్వామి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేశారు.

దేవరపల్లి: స్థానిక ఉమారామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. తెల్లవారు జామున 3 గంటల నుంచి 5 గంటల వరకు స్వామివారికి అభిషేకాలు, 5 గంటల నుంచి స్వామివారి దర్శనం, రాత్రి 9 గంటల నుంచి లింగోద్భవ కాలం వరకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేస్తారని అర్చకులు జి.రాంబాబు తెలిపారు. పల్లంట్లలోని రాజరాజేశ్వరి దుర్గామల్లేశ్వరి ఆలయంలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. గౌరీపట్నం, దుద్దుకూరు, రామన్నపాలెం, కృష్ణంపాలెం, యర్నగూడెం, త్యాజంపూడి, చిన్నాయగూడెం, యాదవోలు, బందపురం గ్రామాల్లో మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు.



అనంతపల్లిలోని వేంగి లింగేశ్వరస్వామి ఆలయం

నల్లజర్ల: అనంతపల్లిలో వేంగిరాజుల కాలం చరిత్రకు ఆనవాళ్లను చాటిచెప్పే అతి పురతాన కట్టడం వేంగిలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ యం.లక్ష్మీశరణ్య, పాలక మండలి చైర్మన్ చిక్కాల నాగేశ్వరావు తెలిపారు. శనివారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఏకాహమహోత్సవం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. నల్లజర్లలో ఉమాచంద్రమౌళీశ్వరాలయం, పోతవరం, దూబచర్ల, శింగరాజుపాలెం, తెలికిచెర్ల గ్రామాల్లోని ఆలయాలలో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

డివిజన్‌లో పటిష్ట బందోబస్తుకు ఏర్పాట్లు



గోదావరి నది స్నానాలు ఆచరించే భక్తులకు నిర్దేశించిన ప్రదేశాల్లోనే స్నానాలు ఆచరించాలి. దొంగలు, చోరీలకు తావులేకుండా ఉండేందుకు ప్రత్యేక నిఘా టీములు ఏర్పాటు చేశాం. పట్టిసీమ క్షేత్రానికి, గోష్పాదక్షేత్రానికి తరలి వచ్చే భక్తుల వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా ఉండేందుకు ప్రధాన కూడళ్లలో బందోబస్తు ఏర్పాటు చేశాం. భక్తులకు అవసరమైన సహాయ, సహకారం అందించేందుకు పోలీసు కంట్రోలు రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఐదుగురు సీఐలు, 12 మంది ఎస్సైలు, ఏఎస్సై, హెచ్‌సీలు–30, కానిస్టేబుళ్లు 50 మంది, 16 మంది మహిళా కానిస్టేబుళ్లు, నలుగురు హోమ్ గార్డులను బందోబస్తుకి వినియోగిస్తున్నాం. వీరితో పాటు డివిజన్‌లో పరిధిలో సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 180 మంది మహిళా పోలీసులు, ఎన్‌ఎస్‌ఎస్, స్కౌట్ విద్యార్థుల సేవలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర వలంటీర్ల సేవలను వినియోగించుకుంటున్నాం. –వీఎస్ఎన్ వర్మ, డీఎస్పీ, కొవ్వూరు

క్లుప్తంగా

శ్రీకృష్ణ దేవరాయల జయంతి

కొవ్వూరు: సీతంపేట గ్రామంలో విజ్జేశ్వరం జంక్షన్ వద్ద కాపు సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు జయంతిని గురువారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, స్థానిక సర్పంచ్ జెట్టి బంగారయ్య, జనసేన నాయకుడు మారిశెట్టి వెంకటేశ్వరరావు, విజ్జేశ్వరం సర్పంచ్ తిక్కా శ్రీనివాస్, వాడపల్లి ఉప సర్పంచ్ లంకదాసు సముద్రం, కాపు సంఘం నాయకులు కటికి శ్రీనివాస్, దేవన వెంకటకృష్ణ, మార్నె నాగేశ్వరరావు, శ్రీరంగం శివ, పూటి వీరబాబు, మదంశెట్టి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సూర్యనారాయణమూర్తికి పూజలు



సౌర పూజలు చుస్తున్న పండితుడు

తాళ్లపూడి: ప్రక్కిలంకలో అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న సౌరయాగం పూజలు 26వ రోజుకు చేరుకున్నాయి. గురువారం కౌతవరపు విశ్వనాథశర్మ, ఇతర వేదపండితుల ఆధ్వర్యంలో సూర్యనారాయణమూర్తి యంత్రం, నేలపై వేసి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. శశిశేఖర మిత్రబృందం ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మార్చిలో రామాలయం ప్రారంభం

తాళ్లపూడి: ప్రక్కిలంకలోని స్టేట్ బ్యాంకు దగ్గర బీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయం వచ్చే నెల ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా భక్తులు రాసిన రామ కోటి పుస్తకాలను శ్రీరాముని విగ్రహం కింద ఉంచుతున్నట్టు వేదపండితుడు కౌతవరపు విశ్వనాథశర్మ తెలిపారు. మార్చిలో 4, 5, 6 తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నారు. దానికి సంబంధించిన కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ మండల ప్రముఖ్ బొర్రా శ్రీరామచంద్రమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

తాళ్లపూడి: స్థానిక పీహెచ్‌సీలో గురువారం ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా క్షయ్ మిత్ర న్యూలాండ్ లాబొరేటరీ వారి సహకారంతో 20 మంది టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్లు అందజేశారు. రోగులకు గోధుమ పిండి, కందిపప్పు, వేరుశనగ పప్పు ఉండలు, కోడి గుడ్లు, చోడి పిండి తదితర వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అన్నపూర్ణ, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ బి.భాగ్యలక్ష్మి, సిబ్బంది శ్రీనివాస్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



పురుషోత్తపల్లిలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

నిడదవోలు రూరల్: జగనన్న గోరుముద్ద పథకంలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ టి.మూర్తిబాబు సూచించారు. నిడదవోలు మండలం పురుషోత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మూర్తిబాబు మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. అనంతరం పది విద్యార్థులతో పరీక్షల సన్నద్ధతపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంఈఓ కిషోర్‌కుమార్, హెచ్‌ఎం డీఎస్‌వీఎస్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

కొవ్వూరు: చిక్కాలపాలెం గ్రామానికి చెందిన వీరవల్లి వెంకటరత్నంను సారా కేసులో అరెస్టు చేసినట్టు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ గురువారం తెలిపారు. అతని వద్ద ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందుతుడిని నిడదవోలు కోర్టుకి హాజరు పరిచినట్టు సీఐ తెలిపారు.

టోల్ ప్లాజా కలెక్షన్ బూత్‌లోకి దూసుకుపోయిన బస్సు

నల్లజర్ల: రాజమహేంద్రవరం నుంచి ఏలూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అనంతపల్లి శివారు టోల్ ప్లాజా వద్ద కలెక్షన్ బూత్‌ను దూసుకుపోయింది. ఈ సంఘటనలో బస్సు కుడి వైపు వెనుక సీట్లో చెయ్యి బయటకు పెట్టి కూర్చున్న ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం గ్రామానికి చెందిన రాములమ్మ చేయి నుజ్జునుజ్జయింది. హైవే అంబులెన్స్‌లో ఆమెను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ డ్రైవరు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి కాటకోటేశ్వరుని కల్యాణోత్సవాలు

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరం గ్రామంలో ప్రసిద్ధిగాంచిన ఉమా కాటకూటేశ్వర లింగేశ్వరస్వామి 60వ వార్షిక కల్యాణోత్సవాలు శుక్రవారం నుంచి 26వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ చైర్మన్ కోసూరి భాస్కరరావు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో చలువ పందెళ్ల సిద్ధం చేశారు. ఈనెల 17న రాత్రి కూచిపూడి నృత్యప్రదర్శన, 18న తెల్లవారుజామున నుంచే స్వామివారికి అభిషేకాలు, సినీ సంగీతవిభావరి, కోలాటం, బాలనాగమ్మ నాటికం, 21న స్వామివారి ఊరేగింపు, సేవ, 22న రాజమండ్రి భావన ఆర్కెస్ట్రా, 24న సినీ సంగీత విభావరి, 26న అన్నసమారాధన, సత్యహరిశ్చంద్ర నాటకం ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగల తొలగింపు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం శాంతినగర్‌లో ఇళ్లను తాకుతూ వెళుతున్న విద్యుత్ తీగల తొలగింపు పనులను గురువారం చేపట్టారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆదేశాలతో విరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు వైర్లు సరిచేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, ఎంపీటీసీ పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావులను పరిశీలించారు.

బైక్ చోరీపై కేసు

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం శివారులో బైక్ చోరీపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై షేక్ సుభానీ గురువారం తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలికి చెందిన జోగి వంశీ గత నెల 22వ తేదీన ఇంటి నుంచి కొత్త హీరోస్ప్లెండర్ ప్లస్ బైక్‌పై నిడదవోలు వైపు వెళుతూ ఉండగా ఫోన్ రావడంతో బైక్ ఆపి నడుచుకుంటూ వెళ్తూ సెల్‌ఫోన్ మాట్లాడుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి బైక్‌ను దొంగిలించినట్టు బాధితుడు వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జగనన్న కాలనీలో గృహాన్ని ప్రారంభించిన మంత్రి



జగనన్న కాలనీలో గృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తానేటి వనిత

చాగల్లు: పేదల సొంతిటికలను నెరవేర్చింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ప్రకృతి విపత్తు నివారణ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. ముప్పవరం గ్రామానికి చెందిన కోటిచుక్కల కోటిబాబు, స్వాతి దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇంటిని హోంశాఖ మంత్రి వనిత రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులందరికీ ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేయడం జరిగింది. ప్రతి లబ్ధిదారుడు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని గృహనిర్మాణాలు పూర్తిచేసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తోందని మంత్రి తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతువిభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, సర్పంచ్ ముప్పిడి మహాలక్ష్మి, మన్యం దుర్గాప్రసాద్, చాగల్లు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళా నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.

బాల్య వివాహ యత్నాన్ని అడ్డుకున్న పోలీసులు

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్



పెద్దలకు కౌన్సిలింగ్ ఇస్తున్న అధికారులు

నల్లజర్ల: అనంతపల్లి ఇందిరమ్మ కాలనీలో 16 ఏళ్ల బాలికకు చేస్తున్న వివాహ యత్నాన్ని గురువారం ఉదయం రెవెన్యూ, పోలీస్, సచివాలయ అధికారులు అడ్డగించారు. గ్రామ సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి కనకదుర్గ, వీఆర్వో రామారావు, అంగన్‌వాడీ కార్యకర్త వెంకటకుమారి, ఏఎన్‌ఎం గౌతమి, ఎంఎంఎల్‌హెచ్‌పీ శ్యామ్‌లు ఆ బాలిక ఇంటికి వెళ్లి బాల్య వివాహాల వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. ఆరోగ్యపరంగా కూడా తీవ్ర సమస్యలు తలెత్తుతాయని వివరించి చెప్పారు. చట్టరీత్యా నేరమని కూడా హెచ్చరించారు. వీరందరి సలహాలు విన్న తర్వాత ఆ బాలిక తల్లిదండ్రులు తమ కుమార్తెకు 18ఏళ్లు దాటిన తర్వాతే పెళ్లి చేస్తామని లిఖిత పూర్వక హామీ తీసుకున్నారు. అందుకు వారు సమ్మతించారు.

ఎన్నికల నియమావళి అమలు చేయాలి

గ్రామ కార్యదర్శులతో ఎంపీడీఓ సమావేశం

నల్లజర్ల: ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేయాలని ఎంపీడీఓ జోగేశ్వరావు గ్రామ కార్యదర్శులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించాలని, నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ఇప్పటికే ప్రదర్శించామన్నారు. కొవ్వూరు డివిజన్‌కు సంబంధించి 242 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారని, మార్చి13న కొవ్వూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు.16న ఓట్ల లెక్కింపు, 21న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. మండలంలో ఫ్లైయింగ్ స్క్వాడ్‌లో తహసీల్దార్, ఎస్ఐ, స్టాటిస్టికల్ టీంలో మండల వ్యవసాయాధికారితో పాటు పోలీసు సిబ్బంది ఉంటారన్నారు. ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ విజయకుమార్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర క్రీడల విభాగం డైరెక్టర్ కప్పల వరలక్ష్మి
- పాఠశాలల్లో వైద్య పరీక్షలు



పెద్దగూడెం పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గోపాలపురం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర క్రీడల విభాగం డైరెక్టర్ కప్పల వరలక్ష్మి అన్నారు. గోపాలపురం పెద్దగూడెం ప్రత్యేక పాఠశాలలో గురువారం 110 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు కంటి, హిమోగ్లోబిన్, బరువు, ఎత్తు వంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వం విద్యతో పాటు భోజన వసతి, వైద్య సదుపాయం కూడా కలిస్తోందన్నారు. అన్నదేవపేట పీహెచ్‌సీ సిబ్బంది పి.అరుణ,టీవీ రామతులసి, హెచ్‌ఎం టీవీ సత్యనారాయణ, సీఆర్పీ కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

ఆలయంలో స్థానికులకు ప్రాధాన్యం లభించేలా కృషి

శ్రీవారి దేవస్థానం నూతన ట్రస్టుబోర్డు సభ్యురాలు పద్మ

ద్వారకాతిరుమల: శ్రీవారి దర్శనార్థం ఆలయానికి వెళ్లే స్థానికులకు తగిన ప్రాధాన్యత లభించేలా కృషి చేస్తామని దేవస్థానం నూతన ట్రస్టుబోర్డు సభ్యురాలు పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ తెలిపారు. ఇటీవల ఆమె ట్రస్టుబోర్డు సభ్యురాలిగా ప్రమాణస్వీకారం చేశారు. దీన్ని పురస్కరించుకుని గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం వద్ద గురువారం అభినందన సభను ఏర్పాటు చేశారు. వెంకటకొండ పద్మ, జ్యోతిశ్రీనివాస్ దంపతులను గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలత, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉక్కుర్తి వెంకట్రావు, నాయకులు అంబటి గాంధి, యిమ్మడి నాగు, చేబోలు రాజేష్, కుంటం సతీష్, స్థానికులు గువ్వల మావుళ్లు, ఒబిలిశెట్టి గంగరాజుకుమార్(శేఖర్) తదితరులు ఘనంగా సత్కరించారు. దుశ్శాలువాలు కప్పి, పూల మాలలు వేసి, అభినందనలు తెలిపారు. అలాగే పలువురు మెమెంటోలను అందజేశారు. అనంతరం ట్రస్టుబోర్డు సభ్యురాలు వెంకటకొండ పద్మ మాట్లాడుతూ గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావుల ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తాం

- ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు
- రైతులు, అధికారులతో సమీక్షా సమావేశం
- పశ్చిమడెల్టాకు 40 పనులకు రూ.3 కోట్ల నిధులు మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

నిడదవోలు: పశ్చిమడెల్టా పరిధిలో రబీ పంటకు ప్రతి ఎకరాకు సాగునీరందించేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు రైతలకు భరోసా ఇచ్చారు. పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో గోవదారి సాగునీటి సరఫరాపై నియోజకవర్గ స్థాయి రైతు సంఘ నాయకులు, రైతులు, జలవనరుల శాఖ అధికారులతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గోదావరిలో నీటి లభ్యత ఆశించిన స్థాయిలో లేకపోవడంతో శివారు ప్రాంతాలకు సాగునీరందడం లేదని అధికారులు ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ పశ్చిమడెల్టా ఆయకట్టుకు రబీలో సాగునీటి ఇబ్బందులను అధిగమించడానికి చేయాల్సిన అత్యవసర పనులకు ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో పంట కాలువల పూడిక తీత, కర్రనాచు తొలగింపు, కాలువలపై క్రాస్ బండ్ల నిర్మాణాలు, కాలువల్లో నీటి లభ్యత ఆధారంగా పంపుల ద్వారా నీటిని పొలాలకు మళ్లించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట్ల ఆయిల్ ఇంజిన్ల ద్వారా రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా తక్షణమే పనులు చేపట్టాలన్నారు. రామయ్యగుంట, ఉండ్రాజవరం ఛానల్‌లో నీటి లెవల్స్ పెంచాలని రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పెరవలి ఈస్ట్ చానల్ పైన 300 మీటర్ల పూడిక తీయాలని రైతులు కోరారు. ఉండ్రాజవరం మండలం పసలపూడి, చిలకపాడు ఆయకట్టుకు వంతు సమయంలో పూర్తిస్థాయిలో నీరందించాలని కోరారు. జలవనరుల శాఖ శెట్టిపేట ఈఈ ఎం.దక్షిణామూర్తి మాట్లాడుతూ గోదావరిలో ఆశించిన స్థాయిలో నీటి లభ్యత లేకపోవడంతో విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమడెల్టాకు 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. సీలేరు పవర్ ప్రాజెక్టు నుంచిప్రస్తుతం 3 వేల క్యూసెక్కుల నీటి విడదల చేస్తున్నారన్నారు. రైతుల సాగునీటి అవసరాల మేరకు సీలేరు నుంచి నీటి విడుదల పెంచిన తరువాత పశ్చిమడెల్టా కాలువలకు 4 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయడానికి అవకావం ఉంటుందని చెప్పారు. వంతుల వారీ విధానంతో శివారు ప్రాంతాలకు సైతం సాగునీరందించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సలహా మండలి చైర్మన్ భూరుగుపల్లి సుబ్బారావు, ఉండ్రాజవరం జెడ్పీటీసీ సభ్యుడు నందిగాం భాస్కరరామయ్య, జలవనరుల శాఖ తాడేపల్లిగూడెం, తణుకు డీఈలు సత్యదేవ్, శ్రీనివాస్, ఏఈలు, సొసైటీ అధ్యక్షుడు, రైతులు పాల్గొన్నారు.

కన్నులపండువగా శివయ్య కల్యాణం



శ్రీ గోలింగేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు



గోష్పాదక్షేత్రంలో సుందరేశ్వస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

నిడదవోలు: పట్టణ నడిబొడ్డున వేంచేసి ఉన్న రాజరాజేశ్వరి సహిత గోలింగేశ్వరస్వామి వారి ఆలయ ఆవరణలో గురువారం రాత్రి స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి స్వామివారికి రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం 3.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండపారాధనలు చేశారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి పట్టణ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అనంతరం స్వామివారి ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాగోళ్లపు వెంకటేశ్వరరావు, టీడీపీ వేదపండితులు మల్లాది సత్యనారాయణశర్మ, తుట్టగుంట రామహనుమత్ శాస్త్రీ, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొండాటి గంగరాజు, తెలుగు పండిట్ పొన్నా కృష్ణబాబు, ఆలయ ఈవో నామా సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో..

ఉండ్రాజవరం: స్థానిక బాలత్రిపుర సుందరీదేవి సమేత గోకర్ణేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుక బోడ్డు వెంకటరాజు దంపతుల ఆధ్వర్యంలో జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి కల్యాణాన్ని తిలకించి, స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు మద్దిరాల సోమసాయి కార్తిక్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కరుటూరి రమేష్‌కుమార్, ఈఓ మీసాల వెంకట్రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొవ్వూరులో..

కొవ్వూరు: పట్టణంలో గోష్పాదక్షేత్రంలో బాల త్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి వారి కల్యాణం గురువారం రాత్రి కన్నుల పండుగలా నిర్వహించారు. ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాసమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు. వందలాది మంది భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.

దేవరపల్లిలో..

దేవరపల్లి: స్థానిక పార్వతి సమేత ఉమారామలింగేశ్వరస్వామి వారి కల్యాణ వేడుక గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. రాత్రి 8 గంటల నుంచి 11.30 గంటల వరకు పురోహితులు కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

సుందరగిరిపై మహా యజ్ఞం పారంభం

నేత్రపర్వంగా నారసింహునికి రుద్రాభిషేకం



స్వామివారి మూలవిరాట్ పూజలు చేస్తున్న పండితులు

ద్వారకాతిరుమల: సుందరగిరిపై స్వయం భూగా కొలువైన శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో మహా సంపుటిత లక్ష్మీనృసింహ ధన్వంతరీ 28వ మహాయజ్ఞం గురువారం వైభవంగా ప్రారంభమైంది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 18న రాత్రి ఈ మహా యజ్ఞాన్ని అట్టహాసంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా ప్రారంభం రోజు ఆలయంలో విశేష పూజాధికాలను నిర్వహించారు. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన, ఐఎస్ జగన్నాథపురంలోని ఈ ఆలయంలో ఏకాదశి పర్వదినం సందర్భంగా యజ్ఞ నిర్వాహకులు కొచ్చెర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ యజ్ఞక్రతువును ప్రారంభించారు. ముందుగా యాగశాలలో ఏర్పాటు చేసిన శాలిగ్రామాలకు తులసీదళాలతో అర్చన జరిపారు. సాయంత్రం గర్భాలయంలోని స్వామివారి మూల విరాట్‌కు రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం యాగశాలలో 1331 కలశాలను ఏర్పాటు చేసి, నవనారసింహ హోమాన్ని వేడుకగా జరిపారు. శుక్రవారం మహాగణపతి హోమం, శనివారం రాత్రి మహా యజ్ఞం, పూర్ణాహుతి, ఆదివారం శాంతి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు గురూజీ తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

కొవ్వూరు: అదనపు కట్నం కోసం తన భర్త వేధిస్తున్నాడని కొవ్వూరు పట్టణానికి చెందిన పిన్నంటి బిందు సాయి నిఖిల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త కిలాని నీలకంఠపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై బి.దుర్గా ప్రసాద్ తెలిపారు. రెండేళ్ల క్రితం తనకి నీలకంఠంలో వివాహమైంది. వారికి ఒక బాబు ఉన్నాడు. కొన్నాళ్ల కాపురం సాఫీగా సాగిందని, ఇటీవల అదనపు కట్నం తీసుకుని రావాలని తనను మానసికంగా, శారీరకంగాను వేధిస్తున్నాడని బిందు సాయి నిఖిల ఫిర్యాదు చేసింది. దీనిపై గురువారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

చాగల్లు: స్థానిక షిర్డిసాయినాథుని ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో సాయినాథుడికి 108 సార్లు సాయిచాలీసా సామూహిక పారాయణం జరిపించారు.